క్లుప్తంగా

నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం



మచిలీపట్నంటౌన్: నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలో వేంచేసియున్న రంగనాయకస్వామి ఆలయ నూతన ధర్మకర్తల మండలి గురువారం ప్రమాణ స్వీకారం చేసింది. ఆలయ ఈఓ మాగపాటి సత్యప్రసాద్‌బాబు, మచిలీపట్నం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఖగ్గా శ్రీనివాసరావు పర్యవేక్షణలో నల్లూరి వెంకటేశ్వరరావు చైర్మన్‌గా, మరో 10 మంది సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని, మున్సిపల్ చైర్మన్ ఎంవీ బాబాప్రసాద్, రాష్ట్ర బీసీ నాయకుడు కొనకళ్ల బుల్లయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

మోపిదేవి: ఎట్టకేలకు గ్రామంలో పైపులైన్‌కు మరమ్మతులు చేశారు. గత వారం రోజులుగా మురుగునీటితో తీవ్ర ఇబ్బందులు పడుతున్న గ్రామస్తుల దుస్థితిని వివరిస్తూ ఈ నెల 11వ తేదీ సాక్షి దినపత్రిక 'పగిలిన మంచినీటి పైపులైన్' అనే కథనం ప్రచురించింది. స్పందించిన పంచాయతీ అధికారులు గురువారం ఉదయం గుంతలు తవ్వి పైపులైన్‌కు మరమ్మతులు చేశారు. సాయంత్రం మంచినీరు వదలడంతో గ్రామస్తులతో పాటు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థినులకు సైకిళ్లు అందజేత



బంటుమిల్లి: స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బంటుమిల్లి బ్రాంచి ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థినులకు సైకిళ్లు అందజేశారు. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సుమారు రూ. 30వేల విలువ చేసే ఐదు సైకిళ్లను బ్యాంకు మేనేజరు సీహెచ్ సందీప్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు సీఎస్ఆర్ నిధులతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఉద్యోగులకు, రైతులకు అందజేస్తున్న పలు రకాల రుణాలపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో హెచ్ఎం జేవీ పద్మజ, ఉపాధ్యాయులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు మండలానికి 200 టన్నుల యూరియా

గూడూరు: రైతుల అవసరాల దృష్ట్యా గూడూరు మండలానికి 200 టన్నుల యూరియా కేటాయించినట్లు మండల వ్యవసాయ అధికారి జి.శివరామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గూడూరు పీఏసీఎస్‌కు 30 టన్నులు, మల్లవోలు పీఏసీఎస్‌కు 30 టన్నులు, రాయవరంకు 15టన్నులు, రామన్నపేటకు 10 టన్నులు, ముక్కొల్లుకు 15 టన్నులు, తరకటూరుకు 30 టన్నులు, కంకటావకు 15 టన్నులు, లేళ్లగరువుకు 15 టన్నులు, ఆకులమన్నాడుకు 20 టన్నులు, రామానుజవత్తర్లపల్లికు 10 టన్నులు, జక్కంచెర్ల పీఏసీఎస్‌కు 10 టన్నులు కేటాయించామని వెల్లడించారు. శుక్రవారం ఈపోస్ మెషిన్‌లో నమోదు చేసి రైతులకు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

ఉరివి చెరువు పంచాయితీపై డీఎల్‌పీవో ఆరా



పెడన: మండలంలోని ఉరివి గ్రామంలో ఉన్న పంచాయతీ చెరువుకు గత పదేళ్లుగా వేలం పెట్టకపోవడంపై మచిలీపట్నం డీఎల్‌పీవో జి.పద్మావతి గురువారం ఆ గ్రామంలో పర్యటించి ఆరా తీశారు. పంచాయతీ చెరువు పరిధి పెడన మండలం ఉరివి గ్రామంలో 80 శాతం, బంటుమిల్లి మండలం పెదతుమ్మిడిలో 20 శాతం ఉండటంతో ఇరు గ్రామాల మధ్య ఈ పంచాయితీ తేలడం లేదని తెలుసుకున్న డీఎల్‌పీవో రెండు గ్రామాలకు చెందిన పెద్దలతో పెడనలో సమావేశం నిర్వహించి సమస్య పరిష్కరించుకునేలా చర్చించుదామని గ్రామస్థులకు సూచించారు. ఆ గ్రామంలో రోడ్డు కావాలని గ్రామస్థులు కోరడంతో అందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం పెనుమల్లి గ్రామంలో పర్యటించారు. సమిత్వ సర్వేపై ఆరా తీశారు. ఈ పర్యటనలో పెడన ఎంపీడీవో ఎ.అరుణకుమారి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

అవనిగడ్డ: నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన 30 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ గురువారం రూ.20,62,587 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

అక్కడ నర్సులే దిక్కు

- పెడన యూపీహెచ్‌సీలో వైద్యులు లేరాయే..
- అసలే విషజ్వరాల విజృంభణ
- ఇబ్బందులు పడుతున్న రోగులు



పెడన యూపీహెచ్‌సీ

పెడన: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పెడన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రూపుదిద్దుకుంది. సుమారు రూ.కోటికి పైగా వెచ్చించి నూతన భవనం నిర్మించి ప్రారంభించారు. అందులో అత్యాధునికీకరణ రక్తపరీక్ష పరికరాలను సైతం ఏర్పాటు చేసి అందుబాటులో తీసుకువచ్చారు. రెగ్యులర్‌గా వైద్యులు కూడా ఉండేవారు. అయితే ప్రస్తుతం ఏమైందో తెలియదు. పెడన అర్బన్ హెల్త్ సెంటరులో వైద్యులు ఎవరూ లేరు. దీంతో అక్కడ విధులు నిర్వహించే నర్సులు, ఏఎన్ఎంలు రోగులకు వైద్యసేవలను అందిస్తున్నారు. రోగాల పరిస్థితి వారికి తెలియకపోతే పెడన పీహెచ్‌సీకి రిఫర్ చేస్తున్నారు. ప్రస్తుతం పట్టణంలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రెగ్యులర్ వైద్యులు లేకపోవడంతో పెడన శివారులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలిపోతున్నారు.

పట్టించుకునే నాథుడే లేరు..

నిన్న.. మొన్నటి వరకు గూడూరు మండలం మల్లవోలుకు చెందిన వైద్యురాలిని డిప్యూటేషన్‌పై పెడన యూపీహెచ్‌సీ(పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం)కి అప్పటి డీఎం అండ్ హెచ్‌వోగా ఉన్న డాక్టర్ గీతాబాయి నియమించారు. గీతాబాయి బదిలీపై వెళ్లిపోవడం ఈమె స్థానంలో డాక్టర్ షర్మిష్ట రావడం.. ఆమె కూడా ఎటువంటి నియామక ఉత్తర్వులు ఇవ్వకపోవడం జరిగింది. ఇటీవల షర్మిష్ట కూడా పదవీ విరమణ చేయడంతో మౌఖిక ఆదేశాలిచ్చిన వారు ఎవరూ లేకపోవడంతో పాటు కొత్తగా జిల్లా అధికారిగా బాధ్యతలు చేపట్టిన అధికారి కూడా యూపీహెచ్‌సీ గురించి పట్టించుకోకపోవడం లేదు. దీంతో ఇన్‌చార్జిగా విధులు నిర్వహించిన వైద్యురాలు మల్లవోలుకు వెళ్లిపోయారు. పది రోజులు కిందట వెళ్లిపోయిన ఈమె స్థానంలో ఎవరినీ నియమించలేదు. దీంతో వైద్యులు లేక ఆసుపత్రి వెలవెలబోతుంది. జ్వరపీడితులు వచ్చినా వారికి తాత్కాలికంగా మందులు ఇచ్చి పంపించేయడం లేదా పెడన పీహెచ్‌సీకి రిఫర్ చేయడం చేస్తున్నారు. పాలకులు అయినా స్పందించి తక్షణం పెడన యూపీహెచ్‌సీకి వైద్యులని నియమించాలని పురప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



ఖాళీగా దర్శనమిస్తున్న యూపీహెచ్‌సీలోని వైద్యుని సీటు

చేనేత కార్మికులపై కూటమి నిర్లక్ష్యం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

పెడన: కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. గురువారం పట్టణంలోని సర్వోదయ చేనేత సొసైటీ కార్యాలయంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి ఆధ్వర్యాన చేనేత అధ్యయన యాత్రను ప్రారంభించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా చేనేత సంఘాలకు చెల్లించవలసిన రిబేట్, సబ్సిడీ, త్రిఫ్ట్ ఫండ్, మార్కెటింగ్ ఇన్సెంటివ్ రూ. 127.87 కోట్లను విడుదల చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆగష్టు 7న జరిగిన చేనేత దినోత్సవంలో సీఎం ఇచ్చిన హామీ 200 యూనిట్లు ఉచిత విద్యుత్ పథకం అమలు కాకపోవడంపై విమర్శించారు. అక్టోబరు 2న చేనేత కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించకపోతే నిరాహార దీక్షలకు కార్మికులు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపుఇచ్చారు. కార్యక్రమంలో చేనేత సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు బుగుడే మాధవ స్వామి, ఉపాధ్యక్షులు గొట్టుముక్కల బాలాజీ, యక్కల పీతాంబరరావు, కోశాధికారి బి.మోహన్ రావు, ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు బండారు ఆనంద్‌ప్రసాదు, సీపీఐ నాయకులు ఎం.రామారావు, పి.ఉమాకాంతరావు, కె.హేమసుందరరావు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



చేనేత కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి సమావేశంలో రామకృష్ణ

14న జిల్లా కార్యవర్గ ఎన్నికలు

మచిలీపట్నంఅర్బన్: ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ కృష్ణా జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు ఈ నెల 14వ తేదీన నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొడాలి శేషయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మచిలీపట్నం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగే సర్వసభ్య సమావేశం అనంతరం ఎన్నికలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి ముఖ్య అతిథులుగా హాజరవుతారని ఆయన తెలిపారు.

డ్రెయిన్‌లోకి దూసుకుపోయిన ట్రాక్టర్



కప్తానుపాలెం(మోపిదేవి): మండలంలోని కప్తానుపాలెం 9వ నెంబర్ కాలువ వద్ద 216 జాతీయ రహదారి పక్కన ఉన్న పెద్ద డ్రెయిన్‌లోకి ట్రాక్టర్ దూసుకుపోయింది. గ్రామస్తుల కథనం మేరకు.. గురువారం మొవ్వ మండలం అయ్యంకి గ్రామం నుంచి రేపల్లెకు దమ్ము వీల్స్‌తో వెలుతున్న టాక్టర్ అదుపుతప్పి డ్రెయిన్‌లోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ గిరిబాబుతో పాటు మరో రైతుకు గాయాలు కావడంతో 108లో మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యుల సూచన మేరకు గిరిబాబును విజయవాడ అక్కడ నుంచి గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నాడు-నేడు పనులు పూర్తి చేయాలి

బంటుమిల్లి: మండలంలోని పెందుర్రు గ్రామంలో నాడు-నేడు పథకంలో అసంపూర్తిగా ఉన్న ఉన్నత పాఠశాల భవన నిర్మాణం పూర్తి చేసి విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక నాయకులతో కలిసి ఆయన గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు లేకపోతే వారి భవిష్యత్ దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే లక్షలాది రూపాయలతో నిర్మాణం జరిగిన సచివాలయ, ఆర్బీకే, వెల్‌నెస్ సెంటర్ భవనాలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. జల జీవన్ మిషన్ పథకంలో లక్షలు ఖర్చు చేసిన గ్రామస్తులకు తాగు నీటి కష్టాలు తప్పలేదని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, రైతు సంఘ అధ్యక్షుడు ఎల్. అజయ్ ఘోష్, స్థానిక నాయకులు వెంట్రపాటి శ్యాం తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణం ఆగిపోయిన పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న నరసింహారావు

త్రీమెన్ కమిటీ చైర్మన్‌గా కాట్రగడ్డ

గూడూరు: తరకటూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం త్రీమెన్ కమిటీని ప్రభుత్వం నియమించింది. చైర్మన్‌గా కాట్రగడ్డ కృష్ణ, సభ్యులుగా గొరిపర్తి రెడ్డియ్య, గుర్రం సురేష్ బాబులు గురువారం నియమితులయ్యారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

ఘంటసాల: దోమలు పెరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని మలేరియా చల్లపల్లి సబ్ యూనిట్ అధికారి పీఎస్ రాజు సూచించారు. ఘంటసాల గ్రామంలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, ఫైలేరియా వంటి వ్యాధులు దోమల ద్వారా సంక్రమిస్తాయన్నారు. కావున కళాశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. కళాశాల ప్రాంగణంలో దోమల నివారణకు ఎబెట్ మందు పిచికారి చేయించారు. అనంతరం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి జ్వరం కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కీటక జనిత వ్యాధుల నివారణకు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక హెల్త్ అసిస్టెంట్లు సీహెచ్ శ్రీనివాసరావు, ఎన్.అనూష, ఆశ కార్యకర్తలు శైలజ, శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.



పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో ఎబెట్ మందు పిచికారి చేయిస్తున్న అధికారులు

సృజనాత్మకతతో విజయాలు సాధించాలి

గుడివాడ టౌన్: విద్యార్థి దశ నుంచే సృజనాత్మకతతో ఆలోచించాలని మచిలీపట్నం ఏజే కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డీఎస్ఎన్ శాస్త్రి అన్నారు. గురువారం స్థానిక ఏఎన్ఆర్ కళాశాలలో 'సృజనాత్మకత.. ఆలోచనా ధోరణి' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యనభ్యసించే సమయంలో కొన్ని అంశాలు మాత్రమే పుస్తకాల్లో ముద్రిస్తారని పేర్కొన్నారు. కానీ అభ్యసించే సమయంలోనే పాఠ్యాంశాల్లోని మూలాలను గుర్తించి వాటి ద్వారా విద్యార్థి సృజనాత్మకంగా ఆలోచించి నైపుణ్యతను పెంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు సృజనాత్మకత మెళకువలపై పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బీఎస్ఎస్ పద్మజ, అధ్యాపకులు సీహెచ్ ప్రకాష్, డీఎస్ ప్రత్యూష, వి.సువర్ణలక్ష్మి, ఎ.సునీత, ఎన్.నాగలక్ష్మి, ఎ.సుఖీల, వి.గోపి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కెడెట్లకు క్రమశిక్షణ అవసరం



గూడూరు: ఎన్‌సీసీ కెడెట్లు క్రమశిక్షణతో ఉండాలని లెఫ్టినెంట్ కల్నల్ ఆర్.కన్నన్ సూచించారు. గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశభక్తి, సహాయ కార్యక్రమాల్లో ఎన్‌సీసీ కెడెట్లు ముందుండాలని పేర్కొన్నారు. విద్యలో రాణించడంతో పాటుగా పర్యావరణ పరిరక్షణలో తమ వంతు పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని జి.విజయ కుమారి, ఎన్‌సీసీ అధికారులు భగవాన్, ధర్మారావు, పీడీ మత్తి అరుణ, చిలుకోటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ఘంటసాల: విద్యుత్ వైర్లపై పడిన చెట్లు కొమ్మలతో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఘంటసాల బోలెంగుంట రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ బుధవారం రాత్రి పేలిపోయింది. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ ఏఈ రవికుమార్ తక్షణమే స్పందించి ఉన్నతాధికారులతో మాట్లాడి అదేరోజు రాత్రి పామర్రు నుంచి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ తీసుకొచ్చి ఏర్పాటు చేశారు. సకాలంలో విద్యుత్ సరఫరా అందించిన విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

జలధీశ్వరుని సన్నిధిలో బీజేపీ టీజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఘంటసాల: ఘంటసాల గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రం ఏకపీఠంపై కొలువై ఉన్న శ్రీబాల పార్వతీ సమేత జలధీశ్వరస్వామివారిని బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ ఆలయ మర్యాదలతో సత్కరించగా అర్చకులు దాలిపర్తి వెంకట చలపతిరావు పూజాధికాలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు.



ప్రభాకర్‌ను సత్కరిస్తున్న ఆలయ సిబ్బంది

షెడ్యూల్డ్ కులాల ఉద్యోగ నియామకాలు ఆపాలి

గుడివాడ టౌన్: రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల్లో షెడ్యూల్డ్ కులాలకు చెందిన కోటా ఉద్యోగాల నియామకాలు నిలుపుదల చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక గుడ్‌మెన్ పేటలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 31 ఏళ్ల వర్గీకరణ పోరాట ఫలితాలు మాదిగలకు దక్కడం లేదన్నారు. గత 18 ఏళ్లుగా వర్గీకరణ విధానంలో మాదిగలు నియామకాలకు నోచుకోలేదన్నారు. శుక్రవారం నుంచి గ్రామ సభలు నిర్వహించి 344 ఏపీ ఎమ్మార్పీఎస్ ప్రత్యేక ఉద్యమాన్ని చేపడుతున్నామన్నారు. మాదిగలకు న్యాయం జరిగే వరకు ఈ పోరాటం ఆగదని హెచ్చరించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల సుధాకర్, రాష్ట్ర కన్వీనర్ పి.దేవానందం, జిల్లా ఇన్‌చార్జ్ కె.గంగాధరరావు పాల్గొన్నారు.

పేర్ని కృష్ణమూర్తి ఆశయాలను కొనసాగిస్తాం

మాజీ మంత్రి పేర్ని నాని

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర మాజీ మంత్రి పేర్ని కృష్ణమూర్తి ఆశయాలను కొనసాగిస్తూ పేదలకు అండగా ఉంటామని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) అన్నారు. పేర్ని కృష్ణమూర్తి వర్ధంతి కార్యక్రమాన్ని నగరంలోని ఒకటవ డివిజన్ పీకేఎం కాలనీలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పేర్ని కృష్ణమూర్తి, నాగేశ్వరమ్మ దంపతుల విగ్రహాలకు నాని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తన తండ్రి పేర్ని కృష్ణమూర్తి పేదలకు నివేశనా స్థలాలు, పెడన, మచిలీపట్నం నియోజకవర్గాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు తరకటూరులో సమ్మర్ స్టోరేజీ వాటర్ ట్యాంకు నిర్మాణం తదితర దీర్ఘకాల సమస్యలను పరిష్కరించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కోశాధికారి బందెల థామస్‌నోబుల్, పార్టీ జిల్లా కార్యదర్శి గణేశన రమేష్, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జక్కుల ఆనంద్‌బాబు(జానీ), మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, నగర ఉపాధ్యక్షుడు షేక్ మొహమ్మద్‌సాహెబ్, గూడవల్లి నాగరాజు, నార్త్ మండల అధ్యక్షుడు మట్టా మోహన నాంచారయ్య, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్ గడిదేశి బాలజీసు, మాజీ కౌన్సిలర్ చిటికిన నాగేశ్వరరావు, పలువురు కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పేర్ని కృష్ణమూర్తి, నాగేశ్వరమ్మ విగ్రహాలకు నివాళులర్పిస్తున్న పేర్ని నాని, నాయకులు

పెడనలో సివిల్ సప్లయి అధికారుల దాడులు

ఒక చోట పట్టుకుని.. మరోచోట వదిలేయడంపై విమర్శలు

పెడన: పట్టణంలోని పలు ప్రాంతాల్లో పీడీఎస్ బియ్యం కొనుగోలు చేసి అక్రమంగా రవాణా చేస్తున్నారనే ఫిర్యాదులు రావడంతో గురువారం పెడన ఇన్‌చార్జి తహసీల్దారు కె.అనిల్‌కుమార్ ఆదేశాలతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో అధికారులు దాడులు చేశారు. గూడూరు రోడ్డులోని మజీద్ ప్రాంతంలోను, పిండిమర వద్ద, రైలు గేటు, ఎన్టీఆర్ పార్కు, ఎన్టీఆర్ క్యాంటీన్ వెనుక అనుమానాస్పదంగా ఉన్న ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఎన్టీఆర్ క్యాంటీన్ వెనుక ఎస్.వెంకటప్రసాద్(నాని) అనే వ్యక్తి వద్ద నాలుగున్నర క్వింటాళ్ల పీడీఎఫ్ బియ్యం లభ్యమయ్యాయి. దీనిపై అధికారులు కేసు నమోదు చేశారు. అలాగే గూడూరు రోడ్డులోని పిండిమర వద్ద మహమదా అనే వ్యక్తి వద్ద నాలుగు బస్తాలు లభ్యమైనా అధికారులు ఎటువంటి కేసు నమోదు చేయకుండా విడిచిపెట్టడంపై విమర్శలు వస్తున్నాయి. రాజకీయ సిఫార్సులు చేసిన వారిని వదిలిపెట్టడం, సిఫార్సులు లేనివారిపై అధికారుల పెత్తనం చేయడం పట్ల పురప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు. న్యాయం అందరికి ఒకే విధంగా చేయాలని, పట్టుకుంటే అందరిని పట్టుకోవాలి లేదా వదిలేయాలనే వాదన పురప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ఏది ఏమైనా అధికారుల తీరు ఆక్షేపనీయంగా మారిందని వారు ఆరోపిస్తుండటం విశేషం. ఈ దాడుల్లో పీడీఎస్ డీటీ నాగమల్లేశ్వరరావు, ఇన్‌చార్జ్ ఈడే విజయలక్ష్మి, వీఆర్వోలు పాల్గొన్నారు.



ఎన్టీఆర్ క్యాంటీన్ వెనుక పట్టుకున్న పీడీఎఫ్ బియ్యం వద్ద అధికారులు

ఆలయ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని వినతి

మోపిదేవి: మోపిదేవి శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానంలో మినిమం టైమ్ స్కేల్‌పై గత 25 ఏళ్లుగా పనిచేస్తున్న సిబ్బందిని క్రమబద్ధీకరించాలని కోరుతూ అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవస్థానం ఎస్టాబ్లిష్‌మెంట్ ఛార్జీస్ 30 శాతం లోపు ఉంటే సర్వీసులు క్రమబద్ధీకరించుకుని జీతాలు పెంచుకునే వెసులుబాటు ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం దేవస్థానం ఎస్టాబ్లిష్‌మెంట్ ఛార్జీస్ 30 శాతం లోపు ఉందని చెప్పారు. కాబట్టి ప్రస్తుతం ఆలయంలో పనిచేస్తున్న మినిమం టైమ్ స్కేల్‌పై పనిచేస్తున్న సిబ్బంది అందరినీ రెగ్యులర్ చేయవచ్చునని తెలిపారు. ప్రభుత్వంపై ఎటువంటి బారం పడదని, అప్పుడు కూడా దేవస్థానం హుండీ ద్వారా వచ్చే ఆదాయంతోనే తమకు జీతభత్యాలు అందుతాయని వివరించారు.



ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

మచిలీపట్నంఅర్బన్/అవనిగడ్డ/ గూడూరు: ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీటీఎఫ్(ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో వారం రోజుల పాటు నిరసనలు చేయనున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అంబటిపూడి సుబ్రహ్మణ్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మొదటి రోజు గురువారం ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. నాలుగు డీఏలు విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు, ఐఆర్ ప్రకటన, బకాయిల చెల్లింపు, హెల్త్ కార్డు పరిమితి పెంపు, అసెస్మెంట్ బుక్‌లెట్ రద్దు వంటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 11 నుంచి 17వ తేదీ వరకు నిరసన వారం కార్యక్రమానికి పిలుపునిచ్చారు. దీంతో పాఠశాలల్లో పనిచేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు, సభ్యులు నల్లబ్యాడ్జీలు పెట్టుకుని విధులకు హాజరయ్యారు.



నాగాయలంక మండలం ఎదురుమొండిలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఫైనల్స్‌కు కేయూ విద్యార్థులు

కోనేరుసెంటర్: ఏపీ ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమరావతి క్వాంటం వ్యాలీ హ్యాకతాన్ - 2025 పోటీల్లో కృష్ణా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఫైనల్‌కు ఎంపికయ్యారని వీసీ కె.రాంజీ తెలిపారు. బుధవారం విజయవాడలోని ధనేకుల ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన సెమీ ఫైనల్ పోటీల్లో కేయూ విద్యార్థులు డి.సంజిత, సుధాకర్ బృందం 2వ బహుమతి అందుకున్నారు. వీరికి రూ. 5వేలు నగదు బహుమతి అందించారు. వీసీ రాంజీ, కళాశాల ప్రిన్సిపల్ డా. ఆర్. విజయ్ కుమారి, డా. సల్మా బేగం గురువారం విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపక బృందం

చేవేంద్రలో చోరీ

పెడన: మండలంలోని చేవేంద్ర గ్రామంలో ఓ ఇంట్లో చోరీ జరిగిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన అంకెం కమలాకరావు తన భార్యతో కలిసి బుధవారం మధ్యాహ్నం మచిలీపట్నం వెళ్లారు. అదేరోజు రాత్రి పదిన్నరకు తిరిగి ఇంటికి వచ్చేసరికి తలుపులు తీసి ఉన్నాయి. లోపలకి వెళ్లి చూడగా గదిలో బీరువా తలుపులు కూడా తీసి ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. మచిలీపట్నం డీఎస్పీ సీహెచ్ రాజా, పెడన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేంద్రప్రసాద్, ఎస్ఐ సత్యనారాయణల సంఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. 25 కాసుల బంగారు, కేజీ వెండీ, రూ. 2లక్షలు నగదు చోరీ జరిగినట్లు కమలాకరావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.